
# బ్లూ మేన్




వోపిక లేని కాళ్ళని గబుక్కుని విరక్కొట్టి, దుమ్ము మీద..... అరుగుమీద..... నగరం నడి బొడ్డు మీద..... ఆకలిమీద కూలబడ్డాడు జయరావు.

అసలు సాయంత్రంపూట ఆ హైవే మీద ఏ అరుగూ అలా ఖాళీగా ఉండదు. ఆరోజు ఆ కొట్టు మూసేసి ఉండటం వల్ల.... తాళంవేపు చూశాడు జయరావు..... పచ్చగా కడుపుతోవున్న కప్పలా ఉంది.

వేళ్ళాడుతున్న కాళ్ళని నెమ్మదిగా అరుగుమీదకి చేర్చాడు. గడచిన గంటలో మూడోసారి తాగిన నీళ్ళు, కడుపులో ఖాళీతో ఆడుతున్నాయి. ఇంకా వాటిని ఆకలి తింటం పూర్తి చెయ్యలేదులా ఉంది.

రోడ్డు ఓ ఫర్లాంగు కనపడుతూంటే చూస్తూ కూచున్నాడు. ఉన్నట్టుండి కడుపు, కూచున్న అరుగు కదిలినట్టనిపించింది జయరావుకి. రోడ్డుమీద బస్సులకి కొమ్ములు, ఆటోలకి తోకలు కనిపించాయి....

మరో రెండు నిముషాలకి పెద్దగా రొద వినపడింది..... కళ్ళముందు అలుక్కుపోతూ కనపడింది..... మరే చప్పుడూ వినపళ్ళేదు.

అదేమిటో తెలుసు జయరావుకి. నెమ్మదిగా గోడ కానుకుని కాస్సేపు కళ్లు మూసుకున్నాడు. అలా కళ్ళు తిరగటం జయరావు పాతికేళ్ళ బతుకులో యిది మొదటిసారి కాదు.

ముందు చీకటి.... చీకటిగా ఉంటుంది. తర్వాత కాస్సేపటికి ఆలోచన్లు తెల్లటి గీతల్లా ఆ చీకట్లో పాకుతాయి. చాలాసార్లు అదే దృశ్యం.... డ్రామాకర్టెన్ వెనకాల నిర్మల హడావిడిగా జాకెట్టు మార్చుకుంటుంటే కనపడ్డ..... గుండ్రటి భుజాలు..... ఆ వీపు నునుపు.... తన నవ్వు.... అంతే వెంటనే కళ్ళు తెరుస్తాడు.

ఏళ్ళ తరబడి దరిద్రంతో పాటు తనలో పెరుగుతున్న చిరాకు వొళ్ళు విరుచుకుని బైటపడుతుంది. అంతే, యిదంతా మామూలే అనుకున్నాడు జయరావు. నెమ్మదిగా పెదాలు కదలకుండా కడుపులో ఆకలికి అలికిడి తెలియకుండా నవ్వుకున్నాడు.

వొంటిమీద బాగా మాసిపోయిన గుడ్డలవాసన తెలుస్తోంది.... కాళ్ళకింద గచ్చు గరగర తెలుస్తోంది.... అట్టకట్టుకుపోతూన్న జుట్టు బరువు తెలుస్తోంది. చిరాకు.... వీటన్నిటికీ చిరాకు. ఆకలికి.... కళ్ళు తెరవటానికి.... ఊపిరి తియ్యటానికి అన్నిటికీ చిరాకే.... పాతికేళ్ల అనుభవాల తర్వాత తనకి మిగిలిందదే.... అదొక్కటే.... ఒక్కటే.... ఒక్క..... కాదు..... యింకోటి కూడా ఎస్సెల్సీ చదువు, అదయ్యేటప్పటికి అందరూ చచ్చారు.

పుట్టి పెరిగిన ఊరు కాబట్టి, ఎవరో దూరపు బంధువు ఒకడుండబట్టి యింత ముద్ద ముష్టిలా పడేసేవారు. కాని ఉద్యోగం.... ఎవరికి పట్టింది. ఏం తోచక తిరుగుతుంటే నాటకాలెయ్యమన్నారు. వేస్తుంటే ఆరోజు.... కర్టెన్ వెనకాల.... హడావిడిగా జాకెట్టు మార్చుకుంటూ నిర్మల.... ఆ వీపు నునుపు.... నవ్వింది. నవ్వి అన్నీ అడిగింది.

నాటకం అవగానే తనతో వచ్చేయమంది. ప్రేమ కాకపోయినా, కనీసం సెక్సైనా కాదని తెలుసుకోవటానికి పదిరోజులు పట్టలేదు. నిర్మల దగ్గర ఆ బ్రోకర్ ఉద్యోగం నచ్చలేదు. ఆ తర్వాత ఎన్నో ఉద్యోగాలు.... చివాట్లు..... బానిసల్ని తిట్టేతిట్లు.... ఉద్యోగాలు దొరకటం.... ఊడటం అన్నీ అలవాటయ్యాయి..... ఆకలి అలవాటయింది.... నీరసం అలవాటయింది..... ఊపిరి తియ్యటం కూడా అలవాటయింది.

ఎప్పుడో..... నెలలో ఏ రెండు మూడు సార్లో.... ఉద్యోగం ఊడినప్పుడో..... దొరికినప్పుడో కడుపు నిండా తిండి ఎవత్తో చెట్టుకిందో..... ఓవర్ బ్రిడ్జ్ కిందో దొరికితే సెక్స్.... అదీ బతుకు.

నెమ్మదిగా కళ్లు తెరిచాడు జయరావు.

అరుగు అంచుమీద ఓ పురుగు పాకుతోంది.... చూశాడు..... 'నే కూడా అలా పాగ్గలనోచ్....' అనుకున్నాడు.

ఎండ చల్లబడి పోయింది.

పేవ్‌మెంట్ మీద, పక్కకి పక్కకి వొరిగిపోతూ యిద్దరు చెయ్యీ చెయ్యీ పట్టుకుని వొస్తున్నారు. ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. వాళ్ళ బట్టల సెంటుని విసిరికొట్టారు జయరావు కూచున్న అరుగుమీదకి....

'కడుపుతోన్నట్టుంది ఆ అమ్మాయి. అందుకే వొంటిలో ఆ మెరుపు.... ఆ బతుకు, అలా

విశ్రాంతిగా, ఆనందంగా తనకి ఒక్కరోజేనా దొరుకుతుందా....' అనుకున్నాడు జయరావు.యింకా అలా చాలా ఆలోచన లొస్తుంటే మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

మగతగా నీరసంలోకి వొరిగే ముందు.... 'ఛ..... ఎందుకూ పనికిరాని ఆలోచనలు.... ఓ పక్కన ఆకలి తొలిచేస్తుంటే.....' అనుకున్నాడు.

★ ★ ★

చీకటి తట్టి లేపినట్టు ఉలిక్కిపడి లేచాడు జయరావు. అరుగు పక్కనే కాల్తున్న సిగరెట్టు నిలబడుంది.

"నిన్నే....." అంది సిగరెట్టు.

"ఊ....." అన్నాడు జయరావు నెమ్మదిగా లేస్తూ....

"నేచెప్పిన పని చేస్తావా..... బాగా డబ్బిస్తా...." అన్నాడు సిగరెట్టు మనిషి కాస్సేపటికి.

అన్నేళ్ళు..... అన్ని రకాల జీవితం గడిపినా భయంపోలేదు జయరావుకి..... "ఏంపని....." అన్నాడు, బెరుకు బెరుగ్గా చివరికి.

"పెద్ద కష్టమేం కాదు.... చెపుతాను. పైగా నీకు మంచి హుషారుగా వుంటుంది కూడా.... ముందు ఏదేనా హోటల్‌కి వెడదాం..... రా" అన్నాడు. సిగరెట్టు విసిరేశాడు.... ముందుకి నడిచాడు.

హోటల్‌లో తనముందు టేబిల్ మీద జయరావుకి, దేశంలోని తిండంతా, డబ్బంతా పేర్చినట్టు కనపడింది. నెమ్మదిగానే తింటున్నా కలబడి కంగారుగా తిన్నట్టనిపించింది.

"వోపికొచ్చిందా" అన్నాడు.... అని అంతవరకూ గడగడా మాట్లాడిన ఆ మనిషి చెప్పాల్సిన ఆ అయిదారు మాటలూ నత్తాడిలా చెప్పాడు.

జయరావుకి ఏమనాలో తెలియలేదు. కడుపులో ఆ మనిషి తాలుకు బిజినెస్ నేర్పు కుదురుగా, నిండుగా ఉంది. వొంటికి వోపికొచ్చింది..... 'సరే....' అన్నట్టు తలూపాడు.

సిగరెట్టు మనిషి వెనకాలే ఓ అరగంట దూరం వెళ్ళాక ఆ యింట్లోకి అడుగుపెట్టాడు జయరావు. యిల్లులా లేదు.... ఏదో గోడవున్ షెడ్డులా ఉందాగది.... బాగా వెలుగ్గానే ఉంది. ఓ మంచం ఉంది.... కెమేరాలున్నాయి.... స్టాండ్‌లున్నాయి.... ఓ ఆడమనిషుంది.

జయరావుని చూడగానే బాగా పరిచయమున్నదానిలా, ఏళ్ళతరబడి అనుబంధమున్న దానిలా నవ్వింది.

జయరావూ నవ్వాడు.

సిగరెట్టు కెమేరాలు సర్దుకుంటుంటే, ఆ ఆడమనిషి అంత వెలుగులో జాకెట్టు విప్పుతుంటే జయరావు చూస్తూ నిలబడ్డాడు.

అలవాటు లేకపోయినా ఆ తంతంగం అంతా ఏమిటో అర్థమైపోయింది జయరావుకి.

తను, ఆ ఆడమనిషి నగ్నంగా, సిగరెట్టు చెప్పినట్టల్లా కలబడి దొర్లితే ఆ కెమేరాలు కాపీతీస్తాయి.... డబ్బుకు కక్కుర్తి పడే నీలం బతుకుని రికార్డు చేస్తాయి..... అదో బిజినెస్....

జాకెట్టు విప్పేసి నవ్వింది.... సిగరెట్టు నవ్వాడు.... నవ్వి తలూపాడు....

జయరావు చచ్చిపోతూ..... కుంచించుకుపోతూ..... ముందుకి కదిలాడు.

★ ★ ★

తెల్లారు ఝామునెప్పుడో హైవే మీద కొస్తూ జేబులో నోట్లని మరోసారి లెక్క చూసుకున్నాడు జయరావు.

'భలే ఉందే ఈ పని.......' అనుకున్నాడు.

"ఇంతకాలం విలువలేంది.... ఎందుకు పనికిరాంది నాబతుకు, నా మగతనమే అనుకున్నాను. కాని యిప్పుడు, భలే....

ఇప్పుడు మగతనంతో కూడా బతకచ్చు.... దేశంలో వ్యాపారం, బతికే అవకాశాలు ఎంతగా పెరుగుతున్నాయి. ఓహో బలే సంతోషంగా వుందే కళ్ళమ్మట నీళ్ళొచ్చినా..... భలే..... భలే..... సంతోషంగా ఉందే....' అనుకున్నాడు జయరావు.

అరుగు చివర కూచుని చుట్టూ చూశాడు. తనచుట్టూ గాలంతా నగ్నంగా, నీలం నీలంగా మారినట్టు కనపడింది. మరోదారిలేక ఆ నీలిరంగులో.... తన ఆరోగ్యం, తనబతుకు బలవుతున్నట్టు, కూరుకుపోతున్నట్టనిపించింది.

తను ఎన్నో ఏళ్ళుగా భద్రపరచుకుంటూ వచ్చిన.... ఆరోజు..... నిర్మల కర్టెన్ చాటున జాకెట్టు మార్చుకుంటుండగా కనపడిన వయసు నునుపు కనపళ్ళేదు జయరావు తలపుకిప్పుడు. ఆ తీపిగుర్తుని చెదలు తినేసినట్టు, ఆ రకపు తన జీవితానికి చిల్లులు పడ్డట్టు, తనలోని మగతనమంతా ఆకలిలాగే మరో దరిద్రంగా మారినట్టు కంగారు పడ్డాడు ఓ క్షణం.... కంగారుపడి గబగబా జేబులో నోట్లని తడుముకున్నాడు.... నీలపు నోట్లని.

• *కథ, 26-9-71 (న్యూవేవ్ రచయితల బులిటెన్)*